# ద్విజాత

"ఆంధ్రశిల్పి" సచిత్ర మాసపత్రిక 1948 'మే' సర్వధారి – వైశాఖము

**ఆ**విడ సినీమా నటి. నీకు సినీమా శిల్పమును గురించి ఏమి తెలియును. ఆవిడను గురించి వ్రాయుటకు? అని అడిగెదవేమో! వెనుకటికో పత్రికాధిపతి వ్రాసినాడులే! "అతని చేత ఏ సినిమా వారును కథ వ్రాయించుకోలేదు. అందుచేత సినిమా పరిశ్రమ బాగుపడినది" అని. ఆ పత్రికాధిపతికి తక్కిన వన్నియు నెంత తెలియునో యిదియు నంతే తెలియును. ఏ కవియును సినిమాలకు కథలు వ్రాయనక్కరలేదు. మరియును బాగుగా నున్నదానిని ఎవరైనను చెరుపవలయును.

నేను ఆమెను పదునేనేండ్ల క్రిందట చూచితిని. కలకత్తాలో నేనొక హోటలులో నుంటిని. ఆ హోటలులోననే ఎదురుగా నున్న గదిలో నామెయు, ఆమె తండ్రియు, తల్లియు, చెల్లెలును ఉండిరి. పదిదినములు, వారును తెలుగువారే అనియే కాని నాకు వారెవరో తెలియదు. అందులో నామె యున్నదని తెలియదు. ఒకనాటి మధ్యాహ్నము నన్ను వారున్న చోటికి రమ్మనిరి. సరేనని వెళ్ళితిని. ఏదో దూరదేశము. అందరము తెలుగువారమే. మర్యాదకు రమ్మన్నారని వెళ్ళితిని.

కాని కారణము అది కాదు. వారితో నెవరో నేనొక క్రొత్త సినిమా తీయుటకు ప్రయత్నము చేయుచున్నాననియు, తత్ప్రయత్నము కోసము కలకత్తా వెళ్ళితిననియు చెప్పినారట! ఆ సంగతి నాకు తరువాత తెలిసినది.

మరి నీవు నిజముగా నందుకోసమే వెళ్ళితివా? అని నీవడిగెదవా – ఓరి పిచ్చివాడ! నేనును నీవలెనే యాంధ్రుడనే. కలకత్తా ఒకందుకు వెళ్ళెదమా! వీలయినచో క్రొత్త సినిమా తీయుదుము. లేనిచో నుద్యోగమునకు ప్రయత్నము చేయుదుము. ఏ చిత్రములో నైననూ నటకుడుగా తీసికొన్నను నష్టములేదు. చివరకు కూరలో, తమలపాకులో, నిమ్మకాయలో తెలుగుదేశమునుండి అక్కడకొక 'వేగను' పంపించమని – సరిగా ఆవేగను చేరదు. చేరినచో, డబ్బు తీయవచ్చునని కూడ వెళ్ళుదుము.

నేను వారి గదిలో కూర్చుండి యున్నాను. తాంబూలమిచ్చినారు. సేవించితిని. మరచిపోయితిని. కాఫీ కూడ నిచ్చినారు. ఆ అమ్మాయి చెల్లెలు

విడిగా నొక చాప వేసినది. ఆ చాపమీద నొక హార్మనీ పెట్టె పెట్టినది. ఆవిడ తండ్రి నాతో నిట్లన్నాడు. "మా అమ్మాయి కొంచెము సంగీతము పాడును. దయచేసి కొంచెము విందురా" అని. అమ్మాయి అనగా ఆ చాప వేసిన అమ్మాయి యే అనుకున్నాను.

"అయ్యో! అంతకంటె కావలయునా?" అన్నాను. ఇంతలో పన్నెండు ఏండ్ల బాలిక వచ్చినది.

ఆ అమ్మాయిలో సిగ్గున్నది. లేదు. అనగా ప్రమాణముగా నెంత యుండవలయునో అంత యున్నది. ఆమె యౌవనపు గడప మీద నున్నది. ఆ సంగతి ఆమెకు తెలియును. ఆ తెలిసిన విషయము ఎంతో మర్యాదగా కాపాడుకొనుచున్నది. వినయమేమి, సిగ్గేమి, మర్యాదయేమి, ఉచితమైన నవ్వేమి అన్నియు సమానముగా కొలతకు తగినట్లున్నవి. వయస్సు పన్నెండేండ్లు అన్నాను కాని పదునాల్గేండ్లకు తక్కువ యుండవు. ఆమె యా వినయములో అమాయకతలో వయసు తక్కువ పిల్ల వలె కన్పించినది. అప్పుడామె నాతో మొత్తము పది మాటలు మాట్లాడినది. ఆ మాటలలోని మెలకువ ఆ కన్నులలోని తెలివి యామె వయసు నేననుకున్నంత తక్కువ కాదని గ్రహించితిని.

ఆమె మొగము గుండ్రన. గుండ్రని మొగముగల స్త్రీలు సామాన్యముగా శీలవతులు వలె గన్పింతురు. కన్నులలో విపరీత కోణము లేర్పడకున్నచో, ఆమె యెర్రని దనుటకు వీలులేదు. చామనఛాయ కంటె మరియొక చాయ యున్నది. నడిమి పాపట తీసినది. ఆ చీర సర్దుకొనుట కాని, ఆ కూర్చుండుట కాని యెంత వినయము! ఎంత సంసారి లక్షణము!! ఎంత యుత్తమ నాయికా పద్ధతి!!!

ఆమె రెండు త్యాగరాజకృతులు పాడినది. గొంతుకంత మధురముగా నున్నది. ఎంత ఒదుగుగల గొంతు!

మాటాడుచుండగా తాననుచున్న మాట కనుగుణంగా కనులు, కనుబొమ్మలు, పెదవి, చెక్కిలి – అంత చక్కగా సముచితముగా భావస్ఫోరకముగా కనరాని కదలికలు కదలినవి.

ఆమె పాడి వెడలిపోయినది. ఆమె తండ్రి నాతోనన్నాడు. "ఈమె నాకుమార్తె. ఏదైన సినిమాలో నీమె చేత నభినయింప చేయవలెనని నా కోరిక.

తమరు మాకట్టి సహాయము చేసి పెట్టెదరేమోనని యాశ పడుచున్నాను. పేదవారము. ఈమెకు చిన్నతనములోననే భర్తపోయెను" అని. నేను నిండుగా "సరి, విచారించెదను" అని లేచి వచ్చినచో నెట్లుండెడిదో. కాని స్పష్టముగా చెప్పివేసితిని. "అయ్యా! నేనంతవాడను కాను. ఏ పనియు లేనివాడను. ఏదైనను పని దొరుకునేమోయని వచ్చిన వాడను. కాని యొక చిత్రము తీయవలయుననియే యున్నది. గారెలు వండవలయు ననగా వేలు చూపించినట్లు, చక్కని చిత్రము తీయుటకు అభినయనమున గాని, కథా విషయమున గాని, ప్రసంగ సందర్భము కాని, పాత్రోచితమైన మూర్తి నెన్నుకొనుటలో గాని నేను చాల సాహాయ్యము చేయగలుగుదును. కాని నా సాహాయ్యమెవ్వరికి కావలయును! నేను వీని వీనిలో సాహాయ్యము చేసెదనంటినేని, యీ సర్వసంగతులు తనకు గూడ తెలియును. అందరికంటె తనకే ఎక్కువ తెలియునని, అనుకోనివాడు మన దేశములో నెవడున్నాడు? ఉదాహరణమే చూడుడు. మీ అమ్మాయి యున్నది. నా చేతిలో నొక సినిమా కంపెనీ యున్నచో కాళిదాసు శాకుంతలము, భవభూతి ఉత్తర రామచరిత్రము, మీ అమ్మాయిని శకుంతలగా, సీతగా పెట్టి తీసెదను. పద్మినీ జాతి స్త్రీ - పతివ్రత - భారత స్త్రీ రత్నము - సాదువైన పాత్రకు కావలసిన సర్వలక్షణములు మీ అమ్మాయి యందున్నవి. మీరు నన్ను క్షమించినచో నొక విషయము చెప్పెదను. ఆ లక్షణములు గ్రహించి యామెకు తగిన యభ్యాసమిచ్చి యామెనట్లు చేసెడు దర్శకుడున్నాడా అని నా యనుమానము" అని చెప్పితిని.

నేను వారి గదినుండి తిరిగి వచ్చుచుండగా ఆవాహనమెంత యాదర సముపేతమో విసర్జన మంత యాదర సముపేతముగా లేదు. లోకము కదా!

ఆమె పేరు చెప్పలేదు. ఏదో యొక పేరు. ఆమెకు నేను పెట్టిన పేరు ద్విజాత. ఈ పేరు పూర్వము పెట్టలేదు. నేడు పెట్టినది. అయినను తగినప్పుడు తగనప్పుడు ద్విజాత యనియే వాడెదను. మీరు సరిగా నర్థము చేసికొందురను కొందును.

తరువాత నొక ఏడాదికి మా యూరొక చిత్రము వచ్చినది. ఏ బొమ్మ వచ్చినను సరే, నేను చూడకుండ వెళ్ళదుగా! మంచిదైనను చెడ్డదైనను సరే!

పోయిచూచెదవా అందువా! ఇదిగో నీకు కోపము రావద్దు. నేనొక కొన్ని వందల చిత్రములు చూచితిననుకొనుము. ఈ చిత్రము మంచిది. బాగుగా నున్నది. అని నేననుకున్న చిత్రము లెన్నియందువు? కోపపడకు, రెండో మూడో!

సంవత్సరము తరువాత చిత్రము వచ్చినదంటినే ఆ చిత్రములో ద్విజాత యున్నది. చెప్పవచ్చినదది. ఆ అమ్మాయిలో సహజముగా నున్న గుణములకు తగిన పాత్రయిది. ఆ రోజున గదిలో చూచినప్పుడామె ప్రవర్తన యెంత సహజముగా నున్నదో, ఎంత సముదాత్తముగా నున్నదో, ఎంత సముచితముగా నున్నదో – అంతకు పదింతలున్నవి. ఆమె యభినయించలేదు. కథాభాగములో నామె పది చోట్ల వచ్చినది. ఎచట వచ్చినను, ఏది మాటాడినను, ఏమి చేసినను ఆమె సహజమైన సౌశీల్యమే గోచరించినది. వినయమే కన్పించినది. ఉచితత్వమే స్ఫురించినది. దర్శకుడామెను సహజముగా నుండ నిచ్చినాడు. క్రొత్తగా వచ్చినది. యెక్కువ డబ్బుకూడ పుచ్చుకొనలేదేమొ! ప్రసిద్ధులైన యితర నటీనటులున్నారు. వారు సరిగా చేయవలయును, తనకు ధనము రావలయును. ఈ పిల్ల వంక చూచెడిదెవరు? అని యామె జోక్యము  కల్పించుకొనలేదు.

ఆ చిత్రము పదియూళ్ళు తిరిగినది. ద్విజాత పేరు, ఆమె యభినయము, ఆమె సంగీతము రెండునెలలలో దేశమంతయు మ్రోగిపోయినది.

ఒక యేడాదిలో విన్నాను. ద్విజాతను ప్రతి దర్శకుడూ తాను తీయు చిత్రములోనికి తీసికొనవలయునని తహతహలాడు చున్నాడని, ఆమె ధర పెరిగిపోవుచున్నదని, నాల్గు మూడేండ్లు గడిచినది. ప్రసిద్ధ సినీమా తారలలో నామె యొక్కతె యైనది.

ఒక బొమ్మలో నెలకు వెయ్యి రూపాయలు పుచ్చుకొని యామె నటించుచున్నదని చెప్పుచున్నారు. మరి కొన్నాళ్ళకు ఆమెయే వేరే కంపెనీ పెట్టినదని, స్వంతముగానే చిత్రములు తీయగలదని.

రెండు మూడేండ్లు క్రింద నామె నటించిన యొక చిత్రము చూచితిని. ప్రక్కన కూర్చున్నవాడు ఆమె ద్విజాత యని చెప్పువరకు నాకు తెలియలేదు. అరే! యీామె ద్విజాతయా? మూడేండ్లలో నింత మారినదా? యీామె చేత

నీ వేషమెందుకు వేయించిరి? కామావేశము గల యీవేషము ఈమె వేయుటకు తగదే! అందుకనియా, అంత మధురమైన ప్రకృతియు ఇంత అసముచితముగా నున్నది! బళిరా! తులసియాకు కోసి తాంబూలము వేసికొందురు!!!

కొన్ని నెలల క్రింద నామె నటించిన మరియొక్క చిత్రము చూచితిని. ఆమె పేరును చూచి జన మెగబడుచున్నారు. ఒక్కరోజున రాత్రి రోడ్డువెంట నొక పదియేండ్ల కుర్రవాడు బీడీ త్రాగుచు నొకపాట పాడుచు పోవుచుండెను. ఆ పాటలోని భావము కాని, దాని ఫణితి కాని, పదియేండ్ల కుర్రవానిలో పచ్చికామమును వృద్ధిచేసెడునంత కుదిలింపు, కదలింపు కలది. నేనా చిత్రమునకు పోయి చూచిన తర్వాత తెలిసినది. ఆ పాట ద్విజాత పాడినది. ఆ పాడినప్పటి ద్విజాతను వర్ణింతునా.. అర్ధనగ్న! పరమకృత్రిమ! కుటిలాపాంగ! విచిత్ర చంక్రమణ దుష్టకామ భావోద్దీపక శరీరాంగ చాలన!

చిత్రమును చూచిన తర్వాత ఇంటికి తిరిగి వచ్చుచున్నాను. నాకు నలువైపుల ద్విజాతను గూర్చిన పొగడికయె.

ఇదివరకు నేనామె నెరుగనిచో బాగుగా నుండెడిదేమో?! అరే, యెరుగుట యెందులకు? చూచినంతసేపు ఆ మూర్తికి ఆ అభినయమునకు సంబంధమేమియు కన్పించదు. నా హృదయ మనుభవించినదే. మనస్సునకు దాటిన రుజువున్నదే!? ఆ సంగీత మేమి! ఆ కంఠ ప్రకృతిలో అంత అస్థానన్యస్తముగా నున్నది!

ఇన్ని ఏండ్లకు మరల ద్విజాతను చూచితిని. మదరాసులో ఒక స్నేహితుడు వారియింటికి పోదమా యన్నాడు. నా కిష్టము లేదు. 'వారు నిన్నెరుగుదురట!' అని అన్నాడు. ఆనాటి విషయము నంత జ్ఞాపకమున్నదాయని నాకును అభిముఖ్యము ఘటిల్లినది. వెళ్ళితిని. పెద్దసౌధము. సావడిలో సోఫాలు, ఒక సోఫా మీద మేమిద్దరము కూర్చుంటిమి.

ఆమె వచ్చినది. లోన లంగా, పైన పలుచని వేయి కుచ్చెళ్ళు సన్నునివి కల చీర బుట్టవలె నున్నది. కనుబొమ్మలు, కనురెప్పలు, చెక్కిళ్ళు, పెదవులు, ముంగురులును, ఫాలము కలియుచోటు సౌందర్య కల్పనావర్ణ పరామృష్టమై యున్నది. ఒక వికారపు నడక. లజ్జగా భావింపచేయ వలయునను కొన్న సిగ్గుకాని

యొక వెగటైన సిగ్గు. "నమస్తే" యని నాకు నమస్కారము చేసినది. రెండు చేతులు జోడించినది. ఒక మెడ మలపుతో ఎదురుగా నున్న సోఫాపై కూర్చున్నది. వంగి ఆ బుంగచీర పాదతలములకు కప్పుకున్నది. పది నిముసములు మాటాడినాము. ఆ నవ్వులు కృత్రిమములు. అట్టి కృత్రిమపు నవ్వులు నవ్వుటకు కూడ అభ్యాసము కావలయును. ఆమె మాటాడిన మాటలు మాటాడిన తరహాలో నున్నదో అసలీ కాలములో ఆ మాటలు పుట్టెనో! వాని యందు సహజత్వము లేదు. యాథార్థ్యము లేదు. నిజమైన హృదయము లేదు. సర్వ వాక్యముల యందును అదేదో నిజముగా తనకు పట్టని అనూహితమైన యొక సాంఘిక భావపు టొత్తిడి వలన కలిగిన వ్యర్థమర్యాదా భావముగా గోచరించుచున్నది.

ఈ పది నిమేషములలో నొక నిమేషాంశమున నామె నిశ్చలముగా కూర్చున్నది. పదియేండ్ల క్రింద కలకత్తాలో చూచిన ఆ మొదటి మూర్తి స్ఫురింపబోయినది. అంతే! మరులిప్తలో ద్విజాత గోచరించినది.